ప్రజాన్యాయస్థానం తీర్పే అంతిమతీర్పు

శాశ్వత లోక్అదాలత్
జడ్జి జ్ఞాన సువర్ణ రాజు

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: ప్రజా ప్రయోజన సేవల్లో ఎటువంటి అవాంతరాలు జరిగినా శాశ్వత లోక్అదాలత్‌కు సత్వరమే సంప్రదించాలని శ్రీకాకుళం జిల్లా శాశ్వత లోక్అదాలత్ న్యాయమూర్తి జ్ఞాన సువర్ణరాజు అన్నారు. శనివారం శ్రీకాకుళం జిల్లా లోక్అదాలత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో శాశ్వత లోక్అదాలత్ జడ్జి సువర్ణరాజు మాట్లాడుతూ ప్రజాప్రయోజన సేవల్లో ఎటువంటి ఇబ్బందులు తలయెత్తినా వెంటనే శాశ్వత లోక్అదాలత్‌కు సంప్రదించి పిర్యాదు చేయాలని విజ్ఞప్తి చేశారు. శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖలు అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జిల్లా అధికారులను అడిగి తెలుసుకున్నారు.. విద్యా,వైద్య రంగాల సేవల్లో లోపాలు ఉంటే సకాలంలో పిర్యాదు చేయాలని ఆయన కోరారు. న్యాయ సేవాధికార సంస్థల చట్టం 1987 మేరకు 2006లో శాశ్వత లోక్అదాలత్ లు ఆవిర్భవించాయని వీటి ప్రధాన ఉద్దేశ్యం సమగ్రమైన, సత్వరమైన, శీఘ్రమైన తీర్పులు ఇవ్వటం శాశ్వత లోక్అదాలత్ లక్ష్యమని సువర్ణరాజు అన్నారు. ఈ సమావేశంలో శ్రీకాకుళం జిల్లా రెవిన్యూ అధికారి పి. మురళీ కృష్ణ మాట్లాడుతూ ప్రతి సోమవారం జిల్లా పరిషత్ సమావేశంలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన జెకెసి స్పందన కార్యక్రమం నిర్వహించి జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన దరఖాస్తులు సంబంధిత శాఖల అధికారులకి అందజేసి సమస్యలు పరిష్కరించడం జరుగుతుందన్నారు. అలాగే పొగిరి పి. హెచ్. సి డా. జంపు కృష్ణ మోహన్ మాట్లాడుతు గ్రామ స్థాయిలో చెపుతున్న వైద్య ఆరోగ్య. సేవలు వివరించారు. అలాగే పోస్టల్, మునిసిపల్, విద్యా శాఖలకు సంబంధించిన అధికారులు వారు ప్రజలకు అందజేస్తున్న ప్రజా ప్రయోజత సేవలు వివరించారు.

త్వరలో మహిళా సంఘాల ప్రతినిధులతో శాశ్వత లోక్అదాలత్ పరిధిలోకి వచ్చే ప్రజా ప్రయోజన సేవలు వివరిస్తామని సువర్ణరాజు అన్నారు.

ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం

విశాలాంధ్ర-పాతపట్నం : మండలం కేంద్రంలో ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు ఫోటోగ్రాఫర్స్ యూనియన్ (పిఎన్‌పివిడబ్ల్యూఏ) ఆధ్వర్యంలో అధ్యక్షుడు తూలుగు భుజంగ రావు అధ్యక్షతన ఫోటోగ్రాఫర్స్ తో కలిసి ఘనంగా నిర్వహించారు. అనంతరం లూయిస్ దాగ్యూరే చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు భుజంగరావు మాట్లాడుతూ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం ప్రతీ ఏటా ఆగష్టు 19న ఆచరించబడుతుందని, ఫోటోగ్రఫీ యొక్క గొప్ప చరిత్ర,కళారూపం, శాస్త్రీయ విజయం రెండింటిలోనూ దాని పాత్రను ఉత్సవంగా సూచిస్తుందని అన్నారు. ఆధునిక ఫోటోగ్రఫీకి మార్గం సుగమం చేసిన లూయిస్ దాగ్యురే 1837లో అభివృద్ధి చేసిన తొలి ఫోటోగ్రాఫిక్ ప్రక్రియ అయిన దాగ్యురే టైప్ ఆవిష్కరణను ఈ రోజు గుర్తుచేసుకుంటున్నామని అన్నారు. కొంత సమయం అన్ని ఫొటోస్టూడియో లు స్వచ్ఛందంగా బంద్ చేసారు. ఈ కార్య క్రమంలో ఫోటోగ్రాఫర్స్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి : ఎంఈవో లక్ష్మణరావు

విశాలాంధ్ర-మందస: డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకులంలో చదువుతున్న విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని మందస మండల విద్యాశాఖాధికారి మర్రిపాటి లక్ష్మణరావు అన్నారు. శనివారం గురుకులంను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అందిస్తున్న సదుపాయాలు బాగున్నాయని కితాబు ఇచ్చారు. విద్యార్థులతో మాట్లాడుతూ విద్య విలువను ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని, క్రమశిక్షణతో శ్రద్ధగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. అనంతరం 10వ తరగతి విద్యార్థుల పాఠ్యాపుస్తకాలు, నోట్ బుక్స్ పరిశీలించారు. విద్యార్థులను అడిగిన ప్రశ్నలకు జవాబు ఇచ్చారు. అనంతరం వసతిగృహం, స్టాక్ రూము, వంటగదిని పరిశీలించి పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ ఎల్.లక్ష్మీ, వైస్ ప్రిన్సిపాల్ ఆర్.శుభాషిలు ఉన్నారు.

జెసిఐ శ్రీకాకుళం గ్రీన్ సిటీ ఆధ్వర్యంలో మెగా ఫ్యూచర్ ట్రైనింగ్ ప్రోగ్రాం

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : విద్యార్థుల్లో నైపుణ్యతను మెరుగుపరచడానికి కమ్యూనికేషన్ స్కిల్స్ టైం మేనేజ్మెంట్ తదితర అంశాలపై శివాని ఇంజనీరింగ్ కళాశాల, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఇంజనీరింగ్ కళాశాల, విద్యాధరి డిగ్రీ కళాశాల మరియు శారద డిగ్రీ కళాశాలలో మెగా ఫ్యూచర్ ట్రైనింగ్ ప్రోగ్రాం జరిగిందని ప్రెసిడెంట్ మణిశర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నేషనల్ కోఆర్డినేటర్ పవన్, సినేటర్ మధుబాబు, ప్రెసిడెంట్ మణిశర్మ ఆధ్వర్యంలో జెసిఐ జోన్ ట్రైనర్స్ జెసి రాజేష్, జెసి ఈశ్వర్, జెసి సుధీర్, జెసి సంతోష్, జెసి దినేష్ లు ట్రైనింగ్ ఇవ్వడం జరిగిందన్నారు. అలాగే కోఆర్డినేటర్ గా వరలక్ష్మి, సూర్య జగదీష్, రామకృష్ణ, సాయి బాబా వ్యవహరించారన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాధరి ప్రిన్సిపల్ జామి. భీమశంకర్, శివాని ప్రిన్సిపల్ శ్రీనివాస్ , హెచ్ ఓ డి మధుబాబు, అంబేద్కర్ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ చిన్నాడ రాజశేఖర్ , విద్యార్థి, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతు శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయం

- వైస్ ఎంపీపీ పూడి నేతాజీ, సర్పంచ్ పూడి వరప్రసాద్

విశాలాంధ్ర-కవిటి: రైతు శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయమని వైస్ ఎంపీపీ పూడి నేతాజీ, సర్పంచ్ పూడి వరప్రసాద్ అన్నారు. ఈ మేరకు శనివారం మండలంలోని జగతి గ్రామ రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు రాయితీపై ఎరువులను స్థానిక సర్పంచ్ పూడి వరప్రసాద్ తో కలిసి పూడి నేతాజీ చేతుల మీదుగా అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతులకు ఆర్థిక తోడ్పాటు అందించేందుకు రాయితీపై విత్తనాలు, ఎరువులు తో పాటు సాగుకు తోడ్పాటు అందించేందుకు వైయస్సార్ రైతు భరోసా అందజేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ భూసరాజు, ఏ ఏ ఓ బి.శ్రీ కళ్యాణ్ రైతులు పూడి వెంకటేశం, భావన నూకరాజు, భావన చందనం, బోర్ర హరిప్రసాద్, భావన శ్రీరామ్ మూర్తి తోపాటు గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

చిన్నారికి రూ.10వేలు ఆర్థిక సాయం

విశాలాంధ్ర-పలాస: కవిటి మండలం ప్రగడపుట్టుగ గ్రామానికి చెందిన ఎండార్పు చిరంజీవి అంజలి దంపతులకు జన్మించిన 9నెలల చిన్నారి పాపకు అధ్యకు హెచ్ఎల్‌హెచ్ అనే అరుదైన వ్యాధి సోకడంతో వైద్య చికిత్స కోసం పవన్‌పుత్ర సేవా సంస్థ సభ్యులు శనివారం పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వ్యవస్థాపక అధ్యక్షులు మజ్జి భాస్కరరావు మాట్లాడుతూ విశాఖపట్నం మహాత్మాగాంధీ క్యాన్సర్స్ ఆసుపత్రిలో అధ్య చికిత్స పొందుతుందని, చిన్నారికి వైద్యులు బోన్ న్యారో ట్రాన్స్‌ప్లంట్ కోసం ఎక్కువ డబ్బులు ఖర్చు అవ్వడంతో నిరుపేదలైన తల్లిదండ్రులకు ఆర్థిక సహాయం చేశామని అన్నారు. చిరంజీవి గ్రామ వాలంటీర్‌గా పని చేస్తున్నారని, చిన్నారి వైద్యల ఖర్చు కోసం దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు బలగ వైకుంటరావు, ఆనందరావు, మెండ సతీష్, కె.మధు, శ్రీకాంత్‌లు పాల్గొన్నారు.

కాశీబుగ్గ: కవిటి మండలం ప్రగడపుట్టుగ గ్రామానికి చెందిన 9 నెలల చిన్నారి అధ్యకు హెచ్ఎల్‌హెచ్ వ్యాధి సోకడంతో చికిత్స కోసం 20 లక్షల రూపాయలు ఖర్చు అవుతుందని డాక్టర్లు తెలియజేశారని, పేదరికంలో ఉన్న తల్లిదండ్రులు చిరంజీవి, అంజలికి ఆర్థిక స్తోమత లేకపోవడంతో ఈ సమాచారం తెలుసుకున్న వెంటనే 20వేల రూపాయలు ఆర్థిక సహాయం చేశామని ఉద్దానం సేవా సమితి సభ్యులు తారక్ తెలిపారు. చిన్నారి ఆపరేషన్‌కు దాతలు ఆర్థిక సహాయం చేయాలని తల్లిదండ్రులు ఎదురు చూస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో హరి, సునీల్, రాహుల్, శరత్, బాలు, అభయ్‌లు పాల్గొన్నారు.

ఉత్తమ రైతు అవార్డు గ్రహీత నాగరాజు పండా

విశాలాంధ్ర-పలాస : పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి పెద్దబ్రాహ్మణవీధికి చెందిన నాగరాజు పండా వరిసాగులో ఉత్తమ రైతు అవార్డును పొందారు. శనివారం గుంటూరు జిల్లా వడ్డేశ్వరంలో గల కె.ఎల్.యూనివర్శిటీలో ఏరువాక ఫౌండేషన్ కిసాన్ మహోత్సవ్ 2023 ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాగరాజు పండాకు అవార్డు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువ కప్పి ఘనంగా సన్మానించి ప్రశంసపత్రాన్ని ఫౌండేషన్ సభ్యులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రుల నుంచి వారసత్వంగా వచ్చిన భూమిలో వ్యవసాయాధికారుల సూచనల మేరకు వరిసాగు చేసి అధిక దిగుబడులు పొందానని, ఉత్తమ రైతుగా ఎంపిక కావడం ఆనందంగా ఉందని అన్నారు. నాగరాజు పండాకు అవార్డు రావడం పట్ల పలాస ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ భవానీ, సోదరుడు కౌన్సిలర్ దుర్గాశంకర్ పండా, పోతనపల్లి హరి, బొర క్రిష్ణారావు, కౌన్సిలర్ సవర సోమేష్, పులి రాజులు హర్షం వ్యక్తం చేశారు.

యన్.పి.యమ్ షాప్ వద్ద కషాయాలు తయారీ

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: మండలం కుశాలపురం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సహజ వనరుల కేంద్రం వద్ద అగ్నిఅస్త్రం కషాయాన్ని రైతులతో తయారు చేయించారు. ఈ సందర్భంగా యూనిట్ ఇన్‌ఛార్జి రజిని మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఎన్.పి.ఎం షాపు వద్ద కషాయాలను తయారుచేసి ఉంచడం జరుగుతుందని, వీటి రైతులు వినియోగించుకోవాలని అన్నారు. వరి పంటలో ముందు జాగ్రత్తగా నీమాస్త్రం పిచికారి చేసుకుంటే తెగుళ్లు, పురుగులు ఉధ్రుతుని తగ్గించవచ్చునని, అలాగే పంటలో రాజీలేని సూత్రాలు తప్పకుండా పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పూర్ణ, అమ్మాజి, రైతు మెరక రామారావు పాల్గొన్నారు.

జగనన్న కాలనీ ప్రారంభించిన కలెక్టర్

విశాలాంధ్ర-జలుమూరు : మండలంలో గల చల్లపేట, లింగాలవలస గ్రామాల్లో జగనన్న కాలనీ ఇళ్లు శనివారం జిల్లా కలెక్టర్ శ్రీ కేస్ లాఠకర్ హాజరై ఇళ్లను ప్రారంభించారు. ఆయన లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ బి సత్యం, డిటి పి. శ్రీనివాసరావు, ఎంపీడీవో అప్పారావు, ఆర్ఐ సతీష్, విఆర్ఓ, సచివాలయ సిబ్బంది, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

22న ప్రెస్ అకాడమీ చైర్మన్ జిల్లాకు రాక

జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ లాఠకర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం: సి.రాఘువాచారి ఆంధ్రప్రదేశ్ మీడియా అకాడమీ(ప్రెస్ అకాడమీ) చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు ఈ నెల 22న జిల్లాకు రానున్నట్లు జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ లాఠకర్ తెలిపారు. ఈ మేరకు శనివారం కలెక్టర్ ఒక ప్రకటన జారీచేశారు. మంగళవారం ఉదయం 08.30గం.లకు విశాఖపట్నంలో బయలుదేరి ఉదయం 10.00గం.లకు శ్రీకాకుళం ఆర్ అండ్ బి అతిథి గృహానికి చేరుకుంటారు. అక్కడ నుండి బయలుదేరి ఉదయం 10.30గం.ల నుండి మధ్యాహ్నం 02.00గం.ల వరకు ఎచ్చెర్లలోని డా.బి.ఆర్. అంబేద్కర్ విశ్వవిద్యాలయం సమావేశ మందిరంలో జరిగే లిసుపరిపాలన దిశగా ఆంధ్రప్రదేశ్‌లి కార్యక్రమంలో పాల్గొంటారని, అలాగే ఈ కార్యక్రమామికి పార్లమెంటు సభ్యులు, శాసన సభ్యులు, శాసన మండలి సభ్యులు తదితరులు హాజరు కానున్నారని తెలిపారు. కార్యక్రమం అనంతరం విశాఖపట్నంకు బయలుదేరి వెళ్తారని కలెక్టర్ ఆ ప్రకటనలో వివరించారు.

తప్పుడు నివేదికలు ఇచ్చి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును

నీరుగార్చిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోండి

- డి.హెచ్.పి.ఎస్. డిమాండ్
- న్యాయం కోసం సెప్టెంబర్ 4,5,7 తేదీలలో కలక్టరు కార్యాలయం ముందు ధర్నా
- సెప్టెంబరు11 నుండి రిలే నిరాహారదీక్షలు

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: ఇచ్ఛాపురం మండలం ఈదుపురం దళితుల ఆస్తులు ధ్వంసం విషయంలో తప్పుడు నివేదికలు ఇచ్చి ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసును నీరుగార్చిన నాటి మండల తహాశీల్దార్ ఎస్. గురు ప్రసాద్,ఇతర సిబ్బందిపై క్రిమినల్ కేసు నమోదు చేసి, విధుల నుండి తక్షణమే తొలగించాలని దళిత హక్కుల పోరాట సమితి,సమాచార హక్కు చట్టం రక్షణ వేదిక జిల్లా కమిటీలు డిమాండ్ చేశాయి.శనివారం నాడు జిల్లా కలక్టరు కార్యాలయంలో జాయింట్ కలక్టర్ నవీన్ ను బాధిత దళిత మహిళ దోప ఎస్తేరు,ఆమె భర్త ఎరవయ్యతో కలిసి మెమొరాండం అందించారు.ఈ సందర్భంగా స.హ.చ.రక్షణ వేదిక జిల్లా అధ్యక్షులు అనపాన షణ్ముఖ రావు,డి.హెచ్.పి.ఎస్.జిల్లా ప్రధాన కార్యదర్శి యడ్ల గోపి,బాధిత మహిళ ఎస్తేరు ఈ సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను క్లుప్తంగా వివరించారు. ఇచ్ఛాపురం మండలం కొఠారీ గ్రామ కాపురస్తుడగు మాజీ సైనికుడు అయిన నా తండ్రి బండారి జేమ్స్ ఏ పాపయ్యకు ఈదుపురం రెవెన్యూ గ్రామంలో సర్వే నెం.399/2%ా% లో ల్యాండ్ సీలింగ్ భూమి విస్తీర్ణం 0.30 భూమికి %ాజజ.263/266/267/ఐసీహెచ్/75 ద్వారా 1986 లో ఎస్సీ కోటా క్రింద "డి" పట్టాను ప్రభుత్వం వారు మంజూరు చేసియున్నారు.డి పట్టా భూమిలో జీడి, మామిడి, పనస, కొబ్బరి చెట్లను పెంచుతూ జీవనోపాధి పొందుతున్నారు.జేమ్స్ తోపాటు భార్య లక్ష్మీకాంతం,పెద్ద కుమార్తె సుభద్ర మరణించడం వలన బండారి రెండవ కుమార్తె దోప ఎస్తేరు ఆ భూమిపై సంపూర్ణ వారసత్వ హక్కులు కలిగి ఉన్నందున భూమిలో ఉన్న చెట్లు ద్వారా వచ్చే ఫల సాయం అనుభవిస్తూ జీవనోపాధి పొందుతున్నాను.

ఆ భూమి రోడ్డుకు ప్రక్కనే ఉన్నందున ఈదుపురం గ్రామానికి చెందిన కొంతమంది అగ్ర కుల పెత్తందారులు కళ్ళు ఇటీవల కాలంలో మాయొక్క భూమిపై పడ్డాయి.గత ఏడాదిన్నర కాలం నుండి మా యొక్క భూమిని ఎల్లాగైనా కబ్జా చేయాలని అగ్ర కులాలు చెందిన పెద్దలు అనేక ప్రయత్నాలు చేయడం మొదలు పెట్టారు.ల్యాండ్ సీలింగ్ భూమికి ప్రభుత్వం ఇచ్చిన "డి పట్టా" భూమి అమ్మకానికి,కొనుగోలు చేయుటకు అవకాశం లేనప్పటికీ,భూమికి సంబంధం లేని వేరే వ్యక్తులు దగ్గర కొనుగోలు చేసినట్లు నకిలీ పత్రాలు సృష్టించి, దళిత వృద్ధ మహిళను అయిన నాకు మానసికంగా ఆందోళనకు గురి చేసియున్నారు. ఆగస్టు 15,2022న నాటి మండల తహశీల్దార్ ఎం.లావణ్య పొజిషన్ సర్టిఫికేట్ కూడా జారీ చేసారు.భూమి శిస్తులు కట్టిన రశీదులు,డి పట్టాదారుల జాబితా,భూ బదలాయింపు నిషేధిత చట్టం 1908 సెక్షన్ 22-%ా(1)(ు%) లో నమోదు కాబడిన లబ్ధిదారుల జాబితా,భూమి రికార్డులకు సంబంధించిన అన్ని ఆధారములు భాదితులు అందించినప్పటికి మండల తహశీల్దార్ ఎస్. గురు ప్రసాద్ నిర్లక్ష్యంగా వ్యవహరించినారు.ఆర్. ఓ.ఆర్. ద్వారా ఆర్పీ నెం. 388/2022 పేరిట విచారణ జరిపి కబ్జాదారులతో రెవెన్యూ యంత్రాంగం కుమ్మక్కైనారు.దీంతో మార్చి24,2023న అగ్రకుల పెత్తందారులు కొంతమంది బాధితుల భూమికి ఏర్పాటు చేసుకున్న కంచె,షెడ్ ను దౌర్జన్యంగా జేసిబితో తొలగించారు.మార్చి 28న చెట్లను తొలగించి,అక్రమ నిర్మాణాలు చేపడతుండగా బాధితురాలు,భర్త వెళ్లి అడుగగా కులం పేరుతో దూషించి, చంపుతామని బెదిరించినారు. ఈ సంఘటనలో ఇచ్ఛాపురం రూరల్ పోలీసులు ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి విచారణ నిమిత్తం మండల తహశీల్దార్ కార్యాలయం వివరణ కోరారు.బాధితులకు ఉన్న ఆధారములు పరిశీలించకుండా చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడిన వ్యక్తులకు కాపాడే ప్రయత్నంలో మండల తహశీలదార్ ఎస్. గురు ప్రసాద్ తన క్రింద పని చేస్తున్న వీఆర్వో టి.సుందర రావు, ఆర్.ఐ.కె.శ్రావణ్ కుమార్,మండల సర్వేయర్ ఎం.తవిటి నాయుడు,గ్రామ సర్వేయర్ కొర్రాయి హరిలతో బాధితులకు వ్యతిరేకంగా నివేదికలు తయారు చేయించారు.ఆ తప్పుడు నివేదికలు ఇచ్చినందున ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును తప్పు త్రోవ పట్టించినారు.రెవెన్యూ అధికారులు ఇచ్చిన నివేదికలు ఆధారంగా కేసు విచారణ నిలుపు చేస్తున్నట్లు,తగిన ఆధారములు లేనందున తదుపరి చర్యలు ముగించినట్లు నోటీసులు పంపినారు.ఆర్టీఐ దరఖాస్తు చేయడం ద్వారా మండల తహశీల్దార్ అసలు భాగోతం బయటపడిందని ఆవేదన వ్యక్తం చేశారు.తప్పు చేసిన అధికారులపై క్రిమినల్ అప్పీల్స్ నెంబర్లు 1837/2019 మరియు 1669/2009లలో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పులు ఆధారంగా క్రిమినల్ కేసులు నమోదు చేసి,విధులు నుండి తొలగించాలని డిమాండ్ చేశారు.తప్పుడు నివేదికలు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే జిల్లా కలక్టరు కార్యాలయం ముందు సెప్టెంబరు4.5.7 తేదీల్లో మూడు రోజులు ధర్నా,సెప్టెంబరు11 నుండి రిలే నిరాహారదీక్షలు చేపడతామని ఆ మెమొరాండం పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డి.హెచ్.పి.ఎస్. జిల్లా అధ్యక్షులు పాల పోలారావు, చిట్టి సింహాచలం, ఏ.ఐ.టి.యు.సి. నాయకులు వై.వెంకట రావు,జి.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

- తప్పుడు నివేదిక అందించి ఉంటే దర్యాప్తు చేసి సస్పెండ్ చేస్తా- జే.సి.నవీన్... ఇచ్ఛాపురం మండలం ఈదుపురం గ్రామంలో దళితుల ఆస్తులు ధ్వంసం చేసిన సంఘటనలో విచారణ నిమిత్తం పోలీసులకు తప్పుడు నివేదికలు మండల తహశీల్దార్ ఇచ్చి ఉంటే దర్యాప్తు చేసి సస్పెండ్ చేస్తామని జే.సి.నవీన్ బాధితులకు హామీ ఇచ్చారు.భాదితులు ఇచ్చిన ఆధారములు పరిశీలించి తగు నివేదిక అందించాలని అధికారులకు ఆదేశించారు.

మండలంలో ఉప ఎన్నికలు

విశాలాంధ్ర-సరుబుజ్జిలి : సరుబుజ్జిలి మండలంలో బొప్పడం పంచాయతీ ఉప ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి పేడాడ వెంకట నరసమ్మ ప్రత్యర్థి అభ్యర్థి పేడాడ అరుణ పైన 127 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. మొత్తం 711 ఓట్లకు గాను 635 ఓట్లు పోల్ అవ్వగా ఎన్నికల అధికారి 5 ఓట్లను రద్దు చేశారు. నోటా కు 5 ఓట్లు పోలైనట్లు తెలియజేశారు. బొప్పడం పంచాయతీ విజయంతో టిడిపి శ్రేణులు పండగ చేసుకుంటున్నాయి. వైసీపీ ప్రభుత్వానికి చరమగీతం పాడే రోజు ముందుందని అందుకు బప్పడం పంచాయతీ ఎన్నికలే నిదర్శనమని టిడిపి రాష్ట్ర కార్యదర్శి శివాల సూర్యనారాయణ తెలియజేశారు. మండలంలోని టెలికిపెంట పంచాయతీలో 10వ వార్డులో వైసీపీ అభ్యర్థి వందాన అప్పల నరసమ్మ తన ప్రత్యర్థ అభ్యర్థి సోమిని చిన్నమ్ముడు పైన 5 ఓట్ల స్వల్ప మెజారిటీతో గెలుపొందారు.

యుజి పురం 4వ వార్డు వైసీపీ కైవసం



విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు : ఉద్దానం గోపినాధపురం పంచాయతీ పరిధిలోని 4వ వార్డు కు శనివారం జరిగిన ఉప ఎన్నికలో వైసీపీ అభ్యర్థి విజయం సాధించారు. 4వ వార్డు సభ్యుడు కె. భీమారావు గత ఏడాది మృతి చెందడం తో ఉప ఎన్నిక జరిగింది. వైసీపీ మద్దతు తో కర్ని కృష్ణారావు (36), టీడీపీ మద్దతుదారుగా కర్ని గంగయ్య (25) పోటీ చేసారు. కృష్ణారావు 11 ఓట్లు మెజారిటీతో గెలుపొందినట్లు రిటర్నింగ్ అధికారి బమ్మిడి ధనుంజయరావు ప్రకటించారు. ఎస్ఐ మధుసూదన్ ఆధ్వర్యంలో గట్టి పోలీసు బందోబస్తు మధ్య ఎన్నిక జరిగింది. ఈ గెలుపుతో యుజి పురం లో వైసీపీ మరింత బలోపేతం అయిందని సర్పంచ్ కర్ని శ్రీను అన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్ ఛార్జ్ మద్దిల హరినారాయణ, వైసీపీ మండల అధికార ప్రతినిధి కొల్లి రమేష్, ఎంపీటీసీ కర్ని లోకనాధం, జోగారావు, మోహనరావు పాల్గొన్నారు.

పాఠశాలలో వినియోగదారుల క్లబ్‌లు ఏర్పాటు

జిల్లా జాయింట్ కలెక్టర్
ఎం. నవీన్

విశాలాంధ్ర-శ్రీకాకుళం: పాఠశాలల్లో వియోగదారుల క్లబ్‌లు ఏర్పాటు చేయడం వలన సమాజానికి ఎన్నో ప్రయోజనాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ తెలిపారు. పాఠశాల స్థాయిలో వినియోగదారుల క్లబ్‌ల ఏర్పాటుపై ఉపాధ్యాయుల శిక్షణా కార్యక్రమంను కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం ఉపాధ్యాయులతో ఆయన అధ్యక్షతన శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశారు. వినియోగదారుల చట్టంపై అందరికీ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. వినియోగదారుల హక్కులను తెలుసుకొని పాఠశాల స్థాయిలో పిల్లలకు వినియోగదారుల చట్టంపై అవగాహన పరిచేందుకు పాఠశాల క్లబ్ లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. నేటి పిల్లలే రేపటి పౌరులని పేర్కొన్నారు. ఈకార్యక్రమంపై విజయవాడ వెళ్లి ఉపాధ్యాయులు శిక్షణ తీకున్నారని, పిల్లల్లో అవగాహన కల్పించాలని చెప్పారు. చట్టం యొక్క విశిష్టత, అవసరాన్ని విద్యార్థులు, ప్రజలకు తెలియజేయాలని వివరించారు. హక్కుల ఉల్లంఘన ఎలా జరుగుతుందనే విషయాలపై తెలిపాలన్నారు. చట్టం యొక్క ఆవశ్యకత, వినియోగంపై తెలపాలని చేప్పారు. వినియోగదారుల సంఘాల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు బి.రామ్మోహనరావు మాట్లాడుతూ వినియోగదారుల చట్టంపై ప్రజల్లో మరింత అవగాహన పెంచాలన్నారు. విద్యార్థి (హైస్కూల్, డిగ్రీ విద్యార్థులకు) దశలోనే వినియోగదారుల చట్టాలపైన అవగాహన పరచాలని చెప్పారు. వినియోగదారుల హక్కులు చట్టాలు, తదితర వాటిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణా కార్యక్రమాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో డిఎస్ఓ వెంకటరమణ, తూనికలు కొలతలు శాఖ జిల్లా అధికారి విశ్వేశ్వరరావు, వినియోగదారుల సంఘాల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు బగాది రామమోహనరావు, మాస్టర్ ట్రైనర్స్ ఎల్. వెంకటచలం, బి. శ్రీనివాసరావు, ఎ.ఎస్.ఓ. జె. రవి, ఎన్ ఫోర్స్ మెంట్ డిటి గోపాల్, డిటి ఈశ్వర సాయి కుమార్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

23 శాతం పీఆర్సీ పెంచడంతో ఎమ్మెల్యేకి అభినందనలు



విశాలాంధ్ర-పాతపట్నం: మండలం కేంద్రంలో సేర్ప్ సంస్థలో వివిధ కేటగిరీలలో రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న 4569 మంది ఎస్ ఇ ఆర్ పి హెచ్ ఆర్ ఉద్యోగులు, మండల సమాఖ్య క్లస్టర్ కో-ఆర్డినేటర్లు (ఎం.ఎస్.సి.సి లు) సపోర్టింగ్ స్టాఫ్ వేతనం వారి బేసిక్ పే ను 23 శాతం పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినందున. పాతపట్నం నియోజకవర్గ పరిధిలోని మండల మహిళా సమాఖ్య ఉద్యోగులు మిక్కిలి సంతోషాన్ని వ్యక్త పరుస్తూ, పాతపట్నం లోని స్థానిక శాసన సభ్యురాలు వారి క్యాంపు కార్యాలయం నందు ఎమ్మెల్యే రెడ్డి శాంతి ని మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛములు అందజేసి దుశ్శాలువతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే రెడ్డి శాంతి తో కలిసి రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు వైయస్ జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కు మరియు స్థానిక శాసన సభ్యురాలు రెడ్డి శాంతి కు వారియొక్క హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

కంట్రీమాల్ - కిచెన్ వేర్ ఎక్స్‌క్లూజివ్ షాప్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే



విశాలాంధ్ర-పాతపట్నం : నియోజకవర్గ శాసన సభ్యురాలు రెడ్డి శాంతి. ఈ రోజు పాతపట్నం గ్రామంలో స్థానిక ఆక్సుర్డ్ వీధి నందు నూతనంగా ఏర్పాటు చేసిన కంట్రీమాల్ - కిచెన్ వేర్ ఎక్స్ క్లూజివ్ షాప్ ను ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు ఎం.శ్యామ సుందరావు, పాతపట్నం మేజర్ పంచాయతీ ఉప సర్పంచ్ సవిరిగాన మమత, వైఎస్ఆర్ సిపి మండల అధ్యక్షుడు సవిరిగాన ప్రదీప్ వైసిపి మండల కార్యదర్శి గొకవలస రాము శ్రీ నీలమణి దుర్గా అమ్మవారి దేవాలయం పాలక మండలి చైర్మన్ నూలు ఈశ్వరరావు, దేవాంగుల సంఘం అధ్యక్షుడు, నూలు బుజ్జి, వార్డ్ మెంబర్లు టంకాల సుధాకర్, మజ్జి వరదరాజు, పెద్దింటి తిరుపతిరావు, శాసనపురి మధుబాబు, రాజు, మరియు వైఎస్సార్సీపీ నాయకులు పాల్గొన్నారు.

సమగ్ర భూమి సర్వేకు రైతులు సహకరించాలి

విశాలాంధ్ర-జలుమూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర భూమిని సర్వేకు రైతులు సహకరించాలని జలుమూరు తహసిల్దార్ బి సత్యం అన్నారు. జలుమూరు మండలం అక్కురాడ గ్రామంలో సమగ్ర భూమిని రీ సర్వేను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ భూములకు సంబంధించిన పత్రాలు సర్వే సిబ్బందికి చూపించి వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. భూ సంబంధిత తేడాలు ఉంటే తగిన ఆధారాలతో రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలన్నారు.

హార్ ఘర్ జల్ పనులు ప్రారంభించిన సర్పంచ్

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : ఈ మండలం మరువాడ పంచాయతీలో జలజీవన్ మిషన్ పనులులో భాగంగా, హార్ ఘర్ జల్ పనులును సర్పంచ్ సూరాడ ధనలక్ష్మి దాసురాజు శనివారం ప్రారంభించారు. మరువాడ పంచాయతీ పరిధిలో గల చొక్కర వానిపేట, గుడ్డిమీదపేట గ్రామాల్లో 2024 నాటికి ప్రతి ఇంటికి త్రాగునీరు అందించే కార్యక్రమంలో భాగంగా ఈరోజు గుడ్డిమీద పేట గ్రామంలో విఘ్నేశ్వర మందిరం నుంచి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో, ఎంపీటీసీ సూరాడ.రాజారావు, మాజీ వైస్ ఎంపీపీ సూరాడ భీమరావు, వార్డుమెంబర్ సూరాడ. కమలబాలరాజు, వైకాపా నాయకులు జి ఈశ్వరరావు, మహిళలు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల కుటుంబాలకు ఉద్యోగాలు ఇవ్వడం పోరాటాల ఫలితమే

- సీఐటీయు నాయకులు

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్: ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు ఆధ్వర్యంలో చేసిన పోరాటాలు ఫలితంగా విలీస పంచాయతీ కార్మికులను ఆప్కాస్ లో కలపడం జరిగిందని, మృతి చెందిన, రిటైర్డు కార్మిక కుటుంబాలకు ఉద్యోగాలు ఇవ్వడం జరిగిందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్(సీఐటీయు)జిల్లా ఉపాధ్యక్షులు అరుగుల. గణేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లపల్లి. బలరాం అన్నారు. మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ దసలవారీగా పోరాటం చేయడంతో ప్రభుత్వం యూనియన్ తో చర్చించి మున్సిపాలిటీలలో పనిచేస్తున్న కార్మికులందరినీ ఆప్కాస్ లో కలపడానికి, మృతి చెందిన రిటైర్ అయిన కార్మికుల కుటుంబాలకు ఉద్యోగాలు ఇవ్వడానికి ప్రభుత్వం అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందని అన్నారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు ని సిఐటియు ఆధ్వర్యంలో పూల బొకే ఇచ్చి కార్మికులను ఆప్కాసులో కలపడానికి చర్యలు తీసుకున్నందుకు ధన్యవాదాలు తెలియజేశారు. కమిషనర్ మాట్లాడుతూ మీరు చేసిన పోరాటాల వలన ప్రభుత్వం, అధికారులుగా మేము మా పరిధిలో ఉన్న సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరిగిందని అన్నారు. కార్మికులంతా క్రమశిక్షణగా పని చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ శ్రీకాకుళం నగర కమిటీ నాయకులు కళ్యాణ .రాజు, శేఖర్, జనార్ధన్,అరుగుల .రాము, డి. చిట్టిబాబు, ఏ.శంకర్, ఏ.మోహన్, గురుస్వామి, బుజ్జి ఈశ్వరరావు, బి.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

లోక్ఆదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలి

- జూనియర్ సివిల్ జడ్జి శ్రీభరణి

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: వచ్చే నెల 9వ తేదీన స్థానిక జూనియర్ సవిల్‌కోర్టులో జరగనున్న జాతీయ లోక్ఆదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోటబొమ్మాళి జూనియర్ సివిల్‌కోర్టు జడ్జి, మండల న్యాయసేవా సంఘం అధ్యక్షరాలు డి. శ్రీభరణి అన్నారు. అమె శనివారం శ్రీకాకుళంలో పోలీస్ అధికారులు, ఏపీపీ వారితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ వచ్చే నెల 9న జరగనున్న లోక్ఆదాలత్‌లో రాజీపడదగ్గ క్రిమినల్ కేసులను గుర్తించి ప్రీ లోక్ ఆదాలత్ ద్వారా పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చిన్నచిన్న తగాదాలు, వరకట్న నిషేద కేసులు, అక్సిడెంట్ కేసులు, పెండింగ్‌లో ఉన్న కోర్టులో ఉన్న కేసులను రాజీపడేలా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోర్టు ఏపీపీ ఒడి. హరిప్రియ, బి. బాలక్రిష్ణ, ఎస్. వెంకటరావు, కె. అశోక్, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, నౌపడ పోలీసులు పాల్గొన్నారు.

రక్తదాత దేవీప్రసాద్ ప్రాణదాత...

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: నగరానికి చెందిన స్టార్ వాకర్స్ క్లబ్ కోశాధికారి బత్తుల దేవీప్రసాద్ గడిచిన పదేళ్లుగా 10సార్లు వరుసగా రక్తదానం చేసి అరుదైన రికార్డ్ నెలకొల్పారు. ప్రస్తుతం 50ఏళ్ల వయస్సులో ప్రతీ మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేస్తూ ఎందరికో స్ఫూర్తి ప్రదాతగా, ప్రాణధాతగా నిలుస్తున్నారు. ఈ తరుణంలో జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ లాఠకర్ శనివారం దేవీ ప్రసాద్‌ను అభినందించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మరియు రిమ్స్ బ్లడ్ బ్యాంక్ విభాగం, రోటరీ క్లబ్ శ్రీకాకుళం, ప్రాణదాత ట్రస్ట్ వంటి సేవా సంస్థలు గుర్తించి తమకు ఎంతో ప్రోత్సహిస్తున్నాయని దేవీప్రసాద్ అన్నారు. త్వరలో శ్రీకాకుళం జిల్లా యంత్రాంగం సారధ్యంలో తప్పనిసరిగా సముచితమైన గుర్తింపు, గౌరవాన్ని ఇస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు.. ప్రతీ రక్తదాత ప్రాణదాతతో సమానమని అన్నారు. నేటికీ గ్రామీణ ప్రాంతాల్లో రక్తదానంపై సరైన అవగాహన లేదని ఈ విషయంలో అన్ని స్వంచ్ఛంద సేవా సంస్థలు పెద్దఎత్తున అవగాహన కల్పించాలని కలెక్టర్ కోరారు.. జిల్లాకు రక్తకొరత తీవ్రంగా ఉందని దీన్ని అధిరోహించుటకు అందరూ నడుమ కట్టి ముందుకు రావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు పీజీ. గుప్తా, శాసపు జోగినాయుడు, గుడ్ల సత్యనారాయణ, సింహాద్రి వేణుగోపాల్, పొట్నూరు నాగేశ్వరరావు, ఎం.మల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరం కండి

విశాలాంధ్ర-హిరమండలం: ప్రభుత్వ ఉన్నత పాఠశాల హిరమండలం లో శ్రీకాకుళం జిల్లా పోలీస్ డిపార్ట్మెంట్ వారు స్ఫూర్తి కార్యక్రమాన్నిశనివారం నిర్వహించారు. బాల బాలికలు పాఠశాలలో చాలా క్రమశిక్షణతో ఉండాలని బయటి ప్రలోభాలకి లొంగకుండా జాగ్రత్త పడాలని, ఎటువంటి చెడు వ్యసనాలకు లోనవ్వకుండా చక్కగా చదువుకొని తమ కుటుంబానికి, తాము చదువుకున్న స్కూలుకి మంచి పేరు తీసుకురావాలని శ్రీకాకుళం జిల్లా స్ఫూర్తి టీమ్ మెంబర్స్ తెలియజేశారు. చెడు స్నేహితులకు, చెడు వ్యసనాలక దూరంగా ఉండాలని సిగరెట్ తాగడం, మద్యపానం వంటివి ఆరోగ్యానికి హానికరమని అలానే ఆడపిల్లలు బయట వ్యక్తులకు ఎవరికీ నమ్మకూడదని కుటుంబానికి మంచి పేరు తీసుకురావాలని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఏఎస్ఐ ఎం. సుధాకర్ పాల్గొని గుడ్ టచ్ బ్యాడ్ టచ్ సైబర్ క్రైమ్ మొదలైన విషయాలు పైన విద్యార్థులకు అవగాహన కల్పించారు. స్ఫూర్తి టీమ్ మెంబర్ ఎం బాబురావు మాట్లాడుతూ విద్యార్థులు సెల్ ఫోన్ కు ఉండాలని తెలియ చేసారు, శ్రీకాకుళం నుంచి వచ్చిన స్ఫూర్తి టీమ్ మెంబర్లు ప్రభావతి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షులుగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి. కేశవరావు వ్యవహరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు కేశవరావు మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమం విద్యార్థుల్లో క్రమశిక్షణను పెంచుతుందని, మంచి స్ఫూర్తినిస్తుందని తెలియజేశారు.

విశ్రాంత ఉద్యోగులకు సన్మానం



విశాలాంధ్ర-సోంపేట : సోంపేటలో నూతనంగా విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనం ప్రారంభమైన సందర్భంగా రిటైర్ అయిన ఉద్యోగుల సేవలను కొనియాడుతూ స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో జైభీమ్ సేన ఆధ్వర్యంలో శనివారం విశ్రాంత ఉద్యోగులకు సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమం జైభీమ్ సేన శ్రీకాకుళం అధ్యక్షులు డాక్టర్ నగిరి మోహనరావు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో డొప్ప వెంకటరావు, మర్రిపాటి పూర్ణచంద్రుడు, గౌలియా ప్రకాశరావు, మట్ట సూర్యనారాయణ, డిస్క హర్ష, కలిగాన ఆనంద్, జర్జాన భగవతిలు పాల్గొన్నారు.

షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి భూమిపూజ

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : స్థానిక మండలపరిషత్ అవరణలో మెయిన్‌రోడ్డుకు అనుకొని సుమారు రూ. 50లక్షలు మండలపరిషత్ నిధులతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం కోసం శనివారం ఎంపీపీ రోణంకి ఉమామల్లేశ్వరరావు, ఎంపీడీవో కె. ఫణీంద్రకుమార్‌లు భూమిపూజ చేశారు. అలాగే మండల పరిషత్ కార్యాలయంలో ఉన్న ఎంపీపీ, ఎంపీడీవో రూంలకు ఇటీవల మరమ్మతులు చేసిన సందర్భంగా వాటిని ప్రారంభించి నేటి నుంచి అక్కడ నుంచి ప్రజలకు సేవలు అందిస్తారు. ఈ కార్యక్రమంలో కళింగ కార్పోరేషన్ డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు అన్నెపు రామారావు, పేడాడ వెంకటరావు, బల్లి కామరాజు, సింగుపురం వినోద్, మండల పరిషత్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

వైసీపీ ఖాతాలో పెద్దలంకం పంచాయితీ

విశాలాంధ్ర-బూర్జ: బూర్జ మండలం, పెద్దలంకాం పంచాయితీలో వైస్సార్సీపీ అభ్యర్థి కాగితపల్లి గోవిందరావు కొమరాపు అచ్చం నాయుడు పై 80 ఓట్లు మెజారిటీ తో సర్పంచ్ గా గెలుపొందారు. పి ఏ సి యెస్ డైరెక్టర్ వావిలపల్లి గోవిందరావు మాట్లాడుతూ ఈ గెలుపే ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం చేసిన అభివృద్ధికి నిదర్శనం అని, ఈ గెలుపునకు పూర్తి సహకారం అందించి నడిపించిన మా యువ నాయకులు తమ్మినేని చిరంజీవి నాగ్‌కి ధన్యవాదాలు తెలియచేశారు.

ఉషోదయ యువజన సంఘం శ్రమదానం

విశాలాంధ్ర-కవిటి : మండల కేంద్రంలోని కవిటి ఉషోదయ యువజన సంఘం ఆధ్వర్యంలో ఉషోదయ యువజన సంఘ సభ్యులు,యువత ఆధ్వర్యంలో శనివారం శ్రమదానం కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీ చింతామణి అమ్మవారి గుడి రోడ్‌లో రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి చెత్తాచెదాలను నిప్పంటించి శుభ్రపరిచారు. రోడ్డుకు ఇరువైపులా బ్లీచింగ్ పౌడర్ వేశారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్తా, చెదారాన్ని తొలగించారు. మొక్కలను తొలగించారు. ఈ కార్యక్రమంలో ఉషోదయ యువజన సంఘం అధ్యక్షులు పాండవ చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ అరంగి మధు, సభ్యులు పులకల వెంకట్రావు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం



విశాలాంధ్ర-సోంపేట : ప్రతి మానవునికి ఆరోగ్యం మహాభాగ్యమని ఎమ్మెల్సీ నర్తురామారావు పేర్కొన్నారు. సోంపేటలో కొత్తగా నిర్మించిన వ్యాయామశాలనుస్థానిక జెడ్పీటీసీ తడక యశోద, తడక జోగారావు, కంచిలి జెడ్పీటీసీ ప్రతినిధి ఇప్పిలి కృష్ణారావులతో కలిసి రామారావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ ప్రస్తుతం మారుతున్న ఆహారపు ఆలవాట్లుతో ఆరోగ్య సమస్యలు కూడా అధికమవుతున్నాయని అన్నారు. ఈ నేపథ్యంలో ప్రతి రోజు వ్యాయామం చేయడం ద్వారా ఆరోగ్యం పెంపొందించుకోవాలని సూచించారు.

సృష్టికి ప్రతి రూపం... ఫోటోగ్రఫీ..!.

కాశీబుగ్గ సి.ఐ శ్రీనివాసరావు

విశాలాంధ్ర-పలాస : సృష్టికి ప్రతి రూపం, పాత జ్ఞాపకాలను సజీవంగా ఉంచేది ఫోటోగ్రఫీ అని, దీనికి సాటి ఏదీ రాదని కాశీబుగ్గ సి.ఐ శ్రీనివాసరావు అన్నారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా శనివారం షణ్ముఖ బిందు పంక్షన్ హాల్‌లో సృష్టి ఐక్యత ఫొటో మరియు వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ (పలాస, మందస, వజ్రపుకొత్తూరు, మెళియాపుట్టి, నందిగాం మండలాల) ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుపు, నలుపు కాలంలో ఫొటోగ్రఫీ విరాజిల్లేదని, ఫోటో గ్రాఫర్‌లు ప్రత్యేకమైన నైపుణ్యం కలిగి ఉండేవారని గుర్తు చేసారు. సాంకేతిక విప్లవం రావడంతో ఫొటోగ్రఫీలో కూడా వినూత్న మార్పులు చోటు చేసుకున్నాయన్నారు. విషాదం.. సంతోషం.. సంఘటన.. ఏదైనా చిత్రంలో బంధించి వెలుగులోకి తెచ్చేది ఫొటోగ్రాఫరేనని దీనికి నైపుణ్యం, సృజన తోడయితే అవిష్కృతమయ్యే చిత్రాలకు లభించే ఆదరణ వేరని అన్నారు. అంతకు ముందు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఆధ్వర్యంలో కాశీబుగ్గ బస్టాండ్ నుంచి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆసుపత్రి రోగులకు పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధ్యక్షులు ఎస్.లక్కా, గౌరవాధ్యక్షులు జయరాం, ఉపాధ్యక్షులు సంతోష్, కార్యదర్శి టి.నాగరాజు, కోశాధికారి బి.బాలక్రిష్ణలతో పాటు కార్యవర్గ సభ్యులు నందు, నాగేంద్ర, చందులు పాల్గొన్నారు.

సారవకోట సిహెచ్‌ఓ పై దర్యాప్తు

విశాలాంధ్ర-సారవకోట : వైద్య ఆరోగ్యశాఖలో ఎక్కడ పనిచేసినా, వివాదాలకు మారుపేరుగా గుర్తింపు పొందిన సూర్యదేవర పద్మావతి పై శనివారం దర్యాప్తు జరగనుంది. సారవకోట పీహెచ్‌సీలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ గా పద్మావతి పనిచేస్తున్నారు. పాలన అనుభవం లేని మెడికల్ ఆఫీసర్లను గుప్పిట్లో పెట్టుకుని, ఆరోగ్య కేంద్రం సిబ్బందిని తీవ్రంగా వేధిస్తున్నట్టు చాలా ఆరోపణలు ఉన్నాయి. పద్మావతి చేరకముందు, సారవకోట ఆరోగ్య కేంద్రం సేవలకు మంచి గుర్తింపు ఉంది. ఆమె జాయిన్ అయిన తరువాత, సిబ్బంది నుంచి, రోగులనుంచి ఎన్నో ఆరోపణలు ప్రారంభమయ్యాయి. పరుష పదజాలంతో దిగువ సిబ్బందిని దూషించడం, ఆడ మగ తేడా లేకుండా బూతులతో విమర్శించడం, తప్పుడు నివేదికలతో జిల్లా అధికారులను తప్పుదోవ పట్టించడం, దిగువ స్థాయి సిబ్బందితో సొంత పనులు చేయించుకోవడం, చివరకు కోళ్లు, చుప్పులు, అప్పడాలు, వడియాలు, కూరగాయలు తెప్పించుకోవడం వంటి ఆరోపణలు కూడా ఉన్నాయి. ఆశ వర్కర్ల వేధింపులపై ఉన్న ఆరోపణలు అన్నీ ఇన్ని కావు. సారవకోట ఎంపీపీ చిన్నాల కుర్మా నాయుడు ఎదుటే, ఒక ఆశ వర్కర్ ఆమె వేధింపులను భరించలేక చనిపోవాలని ఉందని గతంలో వాపోయారు. ఒకసారి పిలిపించి, ఎంపీపీ మందలించిన ఆమె తీరులో మార్పు రాలేదని తెలిసింది. ఆమె ఒక్కరే వల్ల మిగిలిన సిబ్బంది పని చేయలేకపోతున్నారని, ఆమెను బదిలీ చేయించాలని ఎంపీపీ కూర్మినాయుడు, శాసనసభ్యులు ధర్మాన కృష్ణ దాస్ కు లేఖ రాశారు. సిబ్బంది కూడా మూకుమ్మడిగా కృష్ణదాసుని కలిసి వినతి పత్రం సమర్పించారు. డీఎంహెచ్వో తో కృష్ణదాసు ఫోన్లో మాట్లాడినా, ఆమె స్పందించకపోవడం విశేషం. దాంతో, కృష్ణ దాస్ కూడా కలత చెంది, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడుదల రజినికి ప్రత్యేకంగా ఒక లేఖ రాశారు. ఆ శాఖ కమిషనర్ కు కూడా డివో లెటర్ రాశారు. అయినా, ఉన్నత అధికార యంత్రాంగం నుంచి స్పందన లేకపోవడంతో, డి ఎం అండ్ హెచ్ ఓ కు సిబ్బంది రాతపూర్వకంగా రిజిస్టర్ పోస్టులో వినతి పత్రం పంపించారు. అయితే, అది ఆమె టేబుల్ వరకు వెళ్లకుండా, పద్మావతికి అనుకూలుడైన ఒక కీలక ఉద్యోగి పావులు కదిపినట్టు కొందరికి అనుమానాలు ఉన్నాయి. చివరకు సిబ్బంది సారవకోట నుంచి శ్రీకాకుళం వచ్చి, రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు కు తమ బాధలు వివరించుకున్నారు. ఆయన ఫోన్లో డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ మీనాక్షితో మాట్లాడారు. తనకు సిబ్బంది నుంచి ఎటువంటి రాతపూర్వక వినతి పత్రం అందలేదని ఆమె చెప్పారు. ఒక్కరి కోసం ఇంతమంది ఇబ్బంది పడటం ఏమిటని మంత్రి ప్రసాదరావు అసహనం వ్యక్తం చేశారు. ఆ తరువాత, సిబ్బంది స్వయంగా డీఎం అండ్ హెచ్ ఓ ను కలిసి వినతి పత్రం సమర్పించారు. దాంతో, అమె స్పందించి దర్యాప్తు అధికారిగా జిల్లా లెప్రసి అండ్ ఎయిడ్స్ అధికారిని నియమించారు. శనివారం మధ్యాహ్నం సార్వకోట పీహెచ్‌సీలో దర్యాప్తు జరగనున్నది.

మరువలేని తీపి గుర్తు ఫోటోగ్రాఫ్

విశాలాంధ్ర-సోంపేట : ఫోటోగ్రఫీ ప్రతి వ్యక్తి జీవితంలో మరువలేని తీపి గుర్తు వంటిందని కంచిలి ఎంపీపీ పైల దేవదాసురెడ్డి, తహశీల్దార్ సిహెచ్.హైమావతి, ఎంపీడీఓ సిహెచ్.శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై ఎస్.బాలరాజు పేర్కొన్నారు. ఉద్దానం ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫోటోగ్రఫీ దినోత్సవం శనివారం కంచిలిలో ఘనంగా నిర్వహించారు. అనేక మంది అతిథులు పాల్గొనగా ప్రత్యేక సేవా కార్యక్రమంగా మెగా రక్తదాన శిబిరం ఏర్పాటుచేసి తద్వారా 50 మందితో రక్తదానం చేపించడం విశేషం. వక్తలు మాట్లాడుతూ భూమిపై మానవుడి ఆవిర్భావం అనంతరం దశలవారీగా చెందిన అభివృద్ధికి ఫోటోగ్రఫీ అందించిన విభిన్న చిత్రాలు ఒక ఉదాహరణ అని పేర్కొన్నారు. నేల నుంచి నింగి వరకు ప్రతి గ్రహాన్ని పరిశోధించి వాటి యొక్క ప్రయోజనాలు, వాటియొక్క ఉనికి మొదలైన అనేక అంశాలపై జరుగుతున్న ప్రయోగాలకు ఫోటోగ్రఫీ ఎంతో కీలకంగా మారిందని అన్నారు. సమాజం నాగరికంగా అభివృద్ధి చెందే పరిణామ దశలను, ప్రపంచంలో జరుగుతున్న అనేక ఉద్యమాలను నేటి తరానికి పరిచయం చేసుకున్న వాటిలో ఫోటోగ్రఫీ పాత్ర అసాధారణమైనదని అన్నారు. ఇటువంటి ఫోటోగ్రఫీ వృత్తిలో స్థిరపడి జీవితాలను నెట్టుకు వస్తున్న ఫోటోగ్రాఫర్లను అన్ని వర్గాలు ఆదుకోవల్సిన అవసరం ఎంతైనా ఉందని వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో నూతన కార్యవర్గం ఏర్పాటైంది. అధ్యక్షుడిగా పొట్నూరు రాజశేఖర్, ఉపాధ్యక్షులుగా గంటి శ్రీనివాస్, కార్యదర్శిగా రెల్ల నితిన్‌రాజ్, సహకార్యదర్శిగా ఉప్పాడ నాగరాజు, కోశాధికారిగా కె.మురళి, సహకార్యదర్శిగా జగదీష్ మహాపాత్రో తదితరులు ఎన్నికయ్యారు.

అభివృద్ధి దిశగా తీర్చిదిద్దుదాం : ఎంపీపీ నీలవేణి

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు: మండలాన్ని అభివృద్ధి దిశగా తీర్చిదిద్దుదామని, అందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సహకారం అందించాలని ఎంపీపీ ఉప్పరపల్లి నీలవేణి అన్నారు. శనివారం మండల సర్వసభ్య సమావేశం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఆమె అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అభివృద్ధికి, సంక్షేమానికి పెద్దపీట వేస్తుంది అన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరువ చేయాల్సిన బాధ్యత అధికారులదే అన్నారు. ప్రజలకు మేలు చేయాలనే సంకల్పంతో సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి పని చేస్తున్నారు అన్నారు. సిఎం ఆశయ సాధనకు అందరి తోడ్పాటు అవసరం అన్నారు. మంచినీళ్లపేట మినీ జెట్టీ ని ఫిషింగ్ హార్బర్ గా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది అన్నారు. నేడు-నేడు పనులు ద్వారా ప్రభుత్వ బడులను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడం జరిగింది అన్నారు. ఈ సమావేశం లో పలు శాఖల తీరుపై సభ్యులు ధ్వజమెత్తారు. గృహనిర్మాణ శాఖ ఎఈ శ్రీకాంత్ జాడే లేదని, ఇల్ల మంజూరు విషయంలో సర్పంచ్ లకు సమాచారం ఇవ్వడం లేదని లండ లోలాక్షి ధ్వజమెత్తారు. శివరాంపురం అంగన్వాడీ కార్యకర్త అవినీతి పై గత సమావేశంలో ఫిర్యాదు చేసినా చర్యలు లేవని పిఎసిఎస్ చైర్మన్ దువ్వాడ మధుకేశవరావు ప్రశ్నించారు. ఉపాధి పనులు ఇష్టారాజ్యంగా చేస్తున్నారని సర్పంచ్ లు దున్న బాలరాజు, చింత రాజు ధ్వజమెత్తారు. ఔత్సాహికులైన రైతులు ముందుకు వస్తే కంపెనీ ప్రతినిధులు మొక్కలు ఇచ్చి మార్కెటింగ్ వారే చేస్తారని హెచ్‌ఓ సునీత తెలిపారు. వంశధార నీరు శివారు భూములకు నాలుగేళ్లుగా రాకపోవడంతో రైతులు నష్టపోతున్నారని సర్పంచ్ లు అట్టాడ గోపి, మామిడి భాస్కరరావు లు నిలదీసారు. రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్సులను పలాస, అక్కుపల్లి, బెండిగేటు, పలాస వరకు క్లాక్, యాంటీ క్లాక్ గా రెండు బస్సులు తిప్పాలని మండల ప్రత్యేక ఆహ్వానితుడు ఉప్పరపల్లి ఉదయ్ కుమార్ కోరారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ సిహెచ్. ఈశ్వరమ్మ, వైస్ ఎంపీపీ లు తమ్మినాన శ్రావణి, వంక రాజు, డీటీ వాయిలపల్లి గిరిరాజ్, విప్ తిర్రి గుణ, సర్పంచ్ లు, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

ప్రకృతి సేద్య సాగు పంటలను పరిశీలిస్తున్న సిబ్బంది



విశాలాంధ్ర-గార : మండలం వత్సవలస గ్రామంలో ప్రకృతి వ్యవసాయ అడిషనల్ డీపీఎం ధనుంజయ రావు, డిపిపి చంద్రబాబు పీఎండిఎస్ క్షేత్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ నేలను 365 రోజులు ఖాళీ లేకుండా పలు పంటలతో కప్పి ఉంచడం వలన భూమి లోపల పంటలకు అవసరమైన సూక్ష్మజీవుల వ్యవస్థ అభివృద్ధి చెంది సేంద్రీయకర్బణం ఏర్పడుతుందని తెలిపారు. రైతులతో పలు పంటల విధానంలో పంటలు సాగు చేసేలా చేసి పంటలలో దిగుబడులను పెంచేలా చూడాలని సిబ్బందికి తగు సలహాలు సూచనలు ఇచ్చారు. అలాగే ప్రస్తుతం ఖరీఫ్ సీజన్లో వరి సాగులో పూర్తిగా ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ఆచరించేలా చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది గణమ్మ పాల్గొన్నారు.

ఈ క్రాఫ్ నమోదు తప్పనిసరి



విశాలాంధ్ర-జలుమూరు: ప్రతి రైతు వారు పండిస్తున్న పంటను ఈ క్రాఫ్ పద్ధతిలో వ్యవసాయ సిబ్బంది వద్ద పంట వివరాలు నమోదు చేసుకోవాలని వ్యవసాయ శాఖ నరసన్నపేట ఏడి రవీంద్ర భారతి రైతులకు సూచించారు. సారవకోట మండలం బొంతు రైతు భరోసా కేంద్రం పరిధిలోని గ్రామాల్లో పర్యటించి ఈ క్రాప్ నమోదును ఆమె పరిశీలించారు. ఈ క్రాప్ నమోదు చేసుకోవడం వల్ల పంట అమ్ముకునే సమయంలో రైతుకు ఇబ్బందులు ఉండవన్నారు. ఆమెతో పాటు ఏవో వెంకటరావు ఉన్నారు.